అవధానుల సుధాకరరావు

# ఈ ప్రేమ నాకొద్దు...

దూరాన్ని మింగేస్తూ ముందుకి సాగిపోతోంది ఎక్స్‌ప్రెస్ రైలు.

రాత్రి పది గంటల సమయం...

కంపార్టుమెంట్‌లో లైట్లు డిమ్‌గా వెలుగుతున్నాయి. ఫాన్‌లు తిరుగుతున్నాయి.

ప్రయాణీకులు బెర్త్‌లు పర్చుకుని, నిద్రల్లోకి జారిపోయారు-ఒక్క మురళి తప్ప.

నిద్రాదేవి అతని దరిదాపుల్లో లేదు మనసులో మధురమైన తలపులు సందడి చేస్తున్నప్పుడు, ప్రతివాళ్ళకి ఈ పరిస్థితి తప్పదేమో

మురళి కళ్ళు మూసినా, తెరచినా విద్య రూపమే సాక్షాత్కరిస్తోంది. ఓ క్షణం సేపు కూడా ఆమె ఆలోచనకి దూరంగా వుండలేకపోతున్నాడు.

మురళికి విద్యంటే ఎంత ఇష్టమంటే-ఊహూఁ....ఇలా చెప్పే బదులు అతని ప్రాణం విద్య అంటే సరిపోతుందేమో. అలాంటి వ్యక్తి ఆమెని చూడకుండా, ఆమెకి దూరంగా రెండేళ్ళు వున్నాడంటే విశేషం కాదు! ఈ రెండేళ్ళ ఎడబాటుని కొద్ది రోజుల క్రిందట ఆమె రాసిన ఒకే ఒక ఉత్తరంతో మర్చిపోయాడు మురళి. ఆ ఉత్తరం అతను లెక్కలేనన్ని సార్లు చదువుకున్నాడు. ప్రతిసారి అందులో ఏదో కొత్తదనం కన్పించింది. ఆ ఆకర్షణ మళ్ళీ అతని చేత ఉత్తరం చదివించింది.

హైదరాబాద్,
10-2-1982

డియర్ మురళీ!

మొదటి సారిగా నేను నీకు రాస్తున్న (ప్రేమ) లేఖ ఇది. ఇన్నాళ్ళూ రాయలేదంటే కారణం ప్రేమ లేక కాదు. మరెందుకో చెప్పనా!

మనసులోని ప్రేమని ప్రకటించకుండా, దాగుడుమూతలాడుకోవడం ఓ థ్రిల్. అలా వ్యక్తం చేయని ప్రేమ రుచి తెలుసుకోవాలని నా కోరిక. ఇప్పుడా కోరిక తీరిపోయింది.

నీకు-నాకు మధ్య వున్న దూరం రెండొందల మైళ్ళు. అయినా, నిన్ను ప్రతిరోజూ చూస్తూనే వున్నాను తెలుసా....? (కలల్లో).

నీకు చెప్పడానికి ఎన్నెన్నో కబుర్లు నా గుండె అరల్లో భద్రపరచుకున్నాను.

త్వరలో నీవు ఇక్కడికి రాబోతున్నావనే తీయనివార్త తెలిసింది.

నా కోసం నువ్వు రెండు రోజులు కేటాయించాలి. రెండు క్షణాల్లా ఆ రెండు రోజులు గడిచిపోవాలి.

నీ రాకకోసం ఎదురుచూస్తూ

యువర్స్
—విద్య

నిజానికి ఆమెనుండి ఈ ఉత్తరాన్ని ఊహించలేదు మురళి. వాళ్ళిద్దరూ పరాయి వాళ్ళు కాదు. బావా, మరదళ్ళు. విద్యని చిన్నతనం నుండి చూస్తూనే వున్నా ఇప్పటికీ ఆమె మనస్తత్వం మురళికి పూర్తిగా అర్థం కాలేదు.

సార్థక నామధేయురాలు విద్య ప్రతి తరగతి లోనూ ఆమెకి ఫస్టుమార్కులే. ఆమె సందేహాలు తీర్చడానికి ఉపాధ్యాయులే సందేహపడే వారనడం అతిశయోక్తి కాదు.

రత్నంలాంటి పిల్ల. అని అందరూ ప్రశంసించేవారు.

అందుచేతనేమో - అయిదుగురు పిల్లల మధ్య ఆమెని ప్రత్యేకంగా చూసేవారు తల్లిదండ్రులు. ఆమెకి సంబంధించిన ఏ విషయంలోనైనా శ్రద్ధ కనబరచేవారు, ఆమె అడిగింది కాదనకుండా, ఓయువరాణిలా పెంచారు.

వారి పెంపకం విద్య వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేసింది.

తల్లిదండ్రుల గారాబం - ఆమె పెంకెదానిగా మార్చింది. వారి మితిమీరిన ప్రేమ ఆమెని అహంభావిని చేసింది. పెద చిన్న భేదం లేకుండా అందరితోను నిర్లక్ష్యంగా మాట్లాడ్డం అలవాటయింది.

మురళి డిగ్రీ స్టూడెంటుగా వున్న తరుణంలోనే విద్య అతని మనసులో ప్రవేశించింది. అప్పట్నుంచి ఆమెపట్ల ప్రేమ పెంచుకోసాగాడు.

తనకి విద్య మనసులో చోటుందని ఇప్పటివరకూ మురళికి తెలియని విజం. అయితే, ఎప్పుడో ఒకటీ, రెండు సందర్భాలలో నిగ్రహించుకోలేక విద్య తన మనసులో మాట చూచాయగా వెల్లడించకపోలేదు. అప్పుడు మురళి కాస్త చొరవ తీసుకోడానికి ప్రయత్నించగా, విద్య కసిరికొట్టడం జరిగింది.

ఆ తరువాత మురళి బి.కాం. పూర్తిచేసి, విజయవాడలో ఓ బంధువు దగ్గరుంటూ సి.ఏ. చదువు పూర్తి చేసాడు.

ఇంకో ఏడాదవుతే అతను 'చార్టర్డ్ అకౌంటెంట్'గా వృత్తి స్వీకరిస్తాడు.

* * *

ఎదురుపడ్డ ఐదు నిమిషాల వరకూ ఇద్దరూ ఏం మాట్లాడుకోలేదు. కళ్ళు నాలుగు మూగ భాషలో సంభాషించుకున్నాయి.

కుశల ప్రశ్నలతో మొదలయిన కబుర్లు ఈ రెండేళ్ళలో సంభవించిన పరస్పర మార్పుల మీదగా సాగి, భవిష్యత్ ప్రణాళికల మీదకు మళ్ళింది.

"ఏం....విద్యా! ఇంకో రెండు నెలల్లో నీ బి యస్సీ. పూర్తవుతుంది. తరువాత ఏం చేయ

**తనకి విద్య మనసులో చోటుందని ఇప్పటివరకూ మురళికి తెలియని విజం అయితే ఎప్పుడో ఒకటి, రెండు సందర్భాలలో నిగ్రహించుకోలేక విద్య తన మనసులో మాట చూచాయగా వెల్లడించకపోలేదు**

**అప్పుడు మురళి కాస్త చొరవ తీసుకుంటే విద్య కసిరికొట్టడం జరిగింది.**



దక్కించుకున్నావు!" ఆసక్తిగా ప్రశ్నించాడు మురళి.

తలెత్తి అతని మొహంలోకి చూసింది విద్య. ఆమె కళ్ళు బరువుగా క్రిందికి వాలాయి.

"అది నిర్ణయించవలసింది నువ్వే బావా" ఆమె సమాధానం విని అదిరిపోయాడు మురళి. విద్య ఏం ఎరుగనట్టు చిరునవ్వు చిందించింది.

ఆ విషయం అక్కడితో ఆపేస్తూ లేచింది విద్య.

"ఈ రోజుకి నువ్వు రెస్టు తీసుకో బావా! నేను కాలేజీకి వెళ్తున్నాను. రేపు నీ డిన్నర్ మా ఇంట్లో" అని ఆహ్వానించి వెళ్ళిపోయింది విద్య.

ఇంత తొందర్లో తనంత సన్నిహితంగా వస్తుందని అనుకోలేదు మురళి.

# ఒకసారి ఏమయిందంటే....

## సర్వీసింగ్




ఓ రోజు నేను నా స్నేహితుడు బజార్లన్నీ తిరిగి అలిసిపోయి ఓ చిన్న హోటల్ లో అడుగు పెట్టాం. అంతకుముందెప్పుడూ ఆ హోటల్ కి వెళ్ళలేదు. ఇద్దరం ఓ టేబుల్ దగ్గర ఎదురెదురుగా కూర్చున్నాం. సర్వర్ కోసం ఎదురుచూడసాగాం.

అయిదు....పది....పదిహేను నిమిషాలు. ఏ సర్వరూ మా టేబుల్ దగ్గరకి రాలేదు. అసలే అలిసిపోయి ఆకలితో వున్నాడేమో నా స్నేహితుడు చిటపటలాడుతున్నాడు.

ఇంతలో ఒకతను తెల్లపాంటు, షర్ట్ వేసుకుని చేతిలో టిఫిను కాఫీ తీసుకుని మా వేపుకి వస్తున్నాడు. అతను మా టేబుల్ దగ్గరకు రాగానే మా స్నేహితుడు అతనిపై విరుచుకుపడాడు

అంత లేటుగా వచ్చినందుకు తిట్టడం మొదలెట్టాడు. నేను వారిస్తున్నా వినలేదు. ఆ తెల్ల షర్ట్ అతని ముఖం మాడిపోయింది అతనేదో చెప్పబోయాడు. అయినా మా ఫ్రెండు వినిపించుకోలేదు

ఈ లోగా కొంత సేపటికి మా స్నేహితుడి వాగ్దాటి ఆగింది. అప్పుడు ఆ తెల్లషర్టతను నవ్వు ఏడుపు కలిసిన ముఖంతో "ఇది సెల్ఫ్ సర్వీసింగ్ హోటల్ అండి. నేను నా టిఫిన్ తెచ్చుకుంటున్నాను" అన్నాడు

ఆ మాటతో మా ఇద్దరి ముఖాలు పాలిపోయాయి. అప్పటికే హోటలులో అందరూ మావైపు చూస్తున్నారు. ఇక అక్కడ వుండబుద్ధి కాలేదు. వెనక్కు తిరిగిచూడకుండా పరుగులాంటి నడకతో ఆ హోటల్ నుండి బయటపడాం.

-డి వెంకటేశ్వరరావు

(బెంగుళూరు) ❋

---

మరునటి రోజు మురళి విద్య వాళ్ళింటికి వెళ్ళాడు. అక్కడతనికి ప్రత్యేక మర్యాదలు లభించేయి. ఏర్పాట్లన్నీ విద్య స్వయంగా చేయడం పెద్ద విశేషం. ఆమె వంటగదిలోకి, డ్రాయింగ్ రూంలోకి హడావుడి పడుతూ తిరగసాగింది.

"అయిపోయింది బావా, ఒక్క ఫైవ్ మినిట్స్...." అని మళ్ళీ మాయమయింది. విద్య రీడింగు రూంలో, పుస్తకాలతో కాలక్షేపం చేస్తున్న మురళి దృష్టి ఓ ఎరుపురంగు ప్లాస్టిక్ కవరున్న పుస్తకంమీద పడింది. దాన్ని చేతిలోకి తీసుకున్నాడు.

అది దినచర్య రాసుకునే డైరీ. ఒకానొక పేజీకి పెన్ను కేప్ పెట్టబడి వుంది. మురళి ఆ పేజీ తీసాడు. కేప్ చేతిలోకి తీసుకుని, పుస్తకం మూసేయ బోతుండగా. తనపేరు అక్కడ రాసి వున్నట్లుగా అనుమానం తగిలింది. ఆ పేజీని పరిశీలనగా చూసాడు.

"ఫిబ్రవరి 15: మురళిని చూస్తే జాలేస్తుంది. హఠాత్తుగా నాలో కలిగిన మార్పుకి ఉక్కిరిబిక్కిరవుతున్నాడు. నా ప్రేమ వెల్లువలో కొట్టుకు పోతున్నాడు. నిజంగానే నేను అతడ్ని ఇష్టపడుతున్నానని నమ్ముతున్నాడు

కాని. అది నిజంకాదు. మనస్ఫూర్తిగా బావని ఇష్టపడటం లేదు. గతిలేక, గత్యంతరం లేక, గుడ్డిలో మెల్లలా, గాజీ పడుతూ బావని అంగీకరిస్తున్నాను. ఈ బావ కూడా జారిపోతే. గుమాస్తా మొగుడితో కాపురం చేయాలి.

ఈనాడు బావ ఈ స్థితిలో వుంటాడని తెలిస్తే ఆనాడు చులకన చేయకపోదును"

ఇలా రాసి వుంది అందులో. మురళి ముఖం వరుసగా పది చేదుమాత్రలు మింగినట్లుగా అయింది

అప్పుడా గదిలో ఎవరూ లేకపోవడం అతని అదృష్టం. నాలుగడుగుల్లో రోడ్డుమీదికొచ్చాడు. అంతే....

వెనక్కి తిరిగి చూడకుండా, గబగబా నడవసాగేడు.

వీధి మలుపు తిరిగేటప్పుడు తలతిప్పి చూసిన అతనికి ఇంటి ముందు నిలబడి, తదేకంగా చూస్తున్న విద్య కనిపించింది. ఆమె కళ్ళు నీటితో నిండివున్నట్లుగా మురళికి అనిపించింది. ❋